

www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

గురువారం | 01 | అక్టోబర్ | 2026 | పేజీలు: 08


# చదువుతోనే భవిత

**పంచాయతీ కార్యాలయం, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రం, కేజీబీవీలో విద్యా, మౌలిక సదుపాయాల తనిఖీ**

**కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



**దేవరకద్ర, అక్షిత న్యూస్ :** దేవరకద్ర మండలం డోకూరు గ్రామంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం పర్యటించి గ్రామ పంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామ శివారులోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ని సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్యా, వసతి సౌకర్యాలను పరిశీలించారు. ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ వివిధ రికార్డులను ..మిగతా 2లో

# హక్కుల సాధనే లక్ష్యం

**దళిత క్రైస్తవుల సమస్యలకై ఉద్యమిద్దాం**

**76 ఏండ్ల నుండి రాజ్యాంగపరమైన హక్కులకు బయపడుతున్నాం**

**1950 ఆర్డర్ పూర్తిగా రాజ్యాంగానికి విరుద్ధం**

**ఆర్టికల్ 25 దేశంలో అందరికి వర్తిస్తుంది**

**దళిత క్రైస్తవులకు వెన్నుపోటు పొడిచింది కాంగ్రెస్ ప్రభుత్వం**

**వనపర్తిలో దళిత క్రైస్తవుల గర్జన సభ**

**పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ**



**వనపర్తి అక్షిత ప్రతినిధి:** దళిత క్రైస్తవుల సమస్యలకై ఉద్యమిద్దాం అని, 76 ఏండ్ల నుండి రాజ్యాంగపరమైన హక్కులకు బయపడుతున్నాం, 1950 ఆర్డర్ పూర్తిగా రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఎన్సీ జేఏసీ ఆధ్వర్యంలో దళిత క్రైస్తవుల గర్జన మహాసభ కార్యక్రమం ..మిగతా 2లో



# కలెక్టరేట్ పేదలకు భరోసా

**పేదలకు నమ్మకం కలిగించేలా సేవలుండాలి**

**పేదల దరికి ప్రగతి ఫలాలు**

**ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి**

**ఉద్యోగులే ప్రభుత్వానికి ప్రతినిధులు**

**సీఎం రేవంత్ రెడ్డి**





**కరీంనగర్, అక్షిత బ్యూరో :** నూతన కలెక్టరేట్ పేదలకు నమ్మకం కలిగించే కేంద్రంగా మారాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. సమస్యలతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే పేదలు, సామాన్య ..మిగతా 2లో

# ఆహార కల్తీకి కట్టడి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**





**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో :** జిల్లాలోని హోటళ్ళు, బేకరీలు, గురుకుల పాఠశాలలు, వసతి గృహాలలో తయారుచేసే ఆహారంలో కల్తీ వస్తువులను వినియోగించే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్‌తో కలిసి ..మిగతా 2లో

# కట్టుదిట్టమైన భద్రత

**సీఎం పర్యటనకు భారీ బందోబస్తు**

**సభా ప్రాంగణం, హెలిప్యాడ్, రూట్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి**



**రాజన్న సిరిసిల్ల, అక్షిత బ్యూరో :** రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు, సభా ప్రాంగణం, హెలిప్యాడ్, రూట్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి పోలీస్ ..మిగతా 2లో

## ఆహార కల్తీకి కట్టడి

**మొదటి పేజీ తరువాయి...**

హాజరై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హోటళ్ళు, బేకరీలు, తినుబండారాల షాపులను ఆహార భద్రత అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, కల్తీ వస్తువులను ఆహారంలో వినియోగించ కుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యాపారాల అనుమతులు, షాపుల రిజిస్ట్రేషన్లు తనిఖీ చేయాలని, కల్తీ వస్తువులను వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలలో ఆహారం తయారీలో వినియో గించే ముడి పదార్థాల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించా లని, ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధులు, విష బాధ ఘటనలను నివారించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. తనిఖీల సమయంలో లభించిన వస్తువులు, ఆయా వ్యాపార సంస్థల వివరాలు పత్రికలలో వచ్చే విధంగా ఫుడ్ ఇన్స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి సచ్చిదానంద చారి, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ అధికారి వాసు రావు, ఫుడ్ ఇన్స్పెక్టర్ మహేందర్, వైద్యులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కట్టుదిట్టమైన భద్రత

**మొదటి పేజీ తరువాయి...**

ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభా ప్రాంగణం వద్ద భద్రతా ఏర్పాట్లను ప్రత్యేకంగా పరిశీలిస్తూ, సభకు వచ్చే ప్రజలు, ప్రజాప్రతినిధులు, వీఐపీలు, ఇతరుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నారు. హెలిప్యాడ్ ప్రాంతంలోనూ భద్రతను కట్టుదిట్టం చేసి, ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గాల్లో రూట్ బందోబస్తును ఏర్పాటు చేశారు.అలాగే పట్టణంలో ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలను పోలీసులు అమలు చేస్తున్నారు. బందోబస్తు విధుల్లో పాల్గొంటున్న అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఎప్పటికప్పుడు పలు సూచనలు చేస్తున్నారు. విధుల్లో ఉన్న సిబ్బంది మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఎస్పీ సూచించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్, రూట్ మార్గాలు, ట్రాఫిక్ ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత అధికారులతో ఆయన సమన్వయం చేస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా జిల్లా పోలీస్ యంత్రాంగం అన్ని ముందస్తు చర్యలు చేపట్టింది. బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

## హక్కుల సాధనే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి...**

నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ 1950 లో వచ్చిన ఆర్డర్ రాజ్యాంగంలో 25 ఆర్టికల్ కు పూర్తిగా విరుద్ధంగా ఉందని వెంటనే సుప్రీంకోర్టు వెనక్కి తీసుకోవాలని కోరారు. దళిత క్రైస్తవులకు వెన్నుపోటు పొడిచింది కాంగ్రెస్ ప్రభుత్వం అని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని సుప్రీంకోర్టు భిన్నంగా వ్యవహరిస్తుందని చెప్పారు. సిక్కులకు దళిత హోదా ఎ విధంగా ఆర్డర్ ను సవరించారో దళిత క్రైస్తవులకు కూడా దళిత హోదాను రద్దు కాకుండా సవరణ చేయలని విజ్ఞప్తి చేశారు. ఆర్డర్ అనేది పర్మినెంట్ కాదని అవసరాల దృష్ట్యా ఆర్డర్ ను సవరణ చెయ్యాల్సిన అవసరం ఉందని చెప్పారు. దళిత క్రైస్తవులకు ఎస్సి హోదా కల్పించే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. దళితులు కేవలం ప్రార్థనకు మాత్రమే పరిమితం అయినం కానీ పోరాటానికి దూరంగా ఉన్నామని మన మెడపై కత్తి ఉందన్న విషయాన్నీ దళితులు మర్చిపోతున్నారని తెలిపారు. పంజాబ్ లో సిక్కులు తమ హక్కులను ఎ విధంగా సాధించుకున్నారో అదే స్పూర్తితో మనం ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. మనకు భయం ఉంది. సిక్కులకు భయం లేదని పోరాటంతో తమ హక్కులను సాధించుకున్నారని తెలిపారు. దళిత క్రైస్తవుల సమస్యలు పరిష్కరించడానికి అవకాశం ఉందా అని ఆలోచిస్తే దేశం మతపాలకులు చేతిలో ఉంది ఎవరైతే హక్కులను అడ్డుకుంటున్నారో వారే ఆర్డర్ తీసుకొచ్చారని గుర్తు చేశారు.

# కలెక్టరేట్ పేదలకు భరోసా

**మొదటి పేజీ తరువాయి...**

ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావించి అధికారులు, ఉద్యోగులు సేవలందించాలని సూచించారు. ప్రజల సమస్యల చిక్కుముడులు విప్పేందుకు కలెక్టరేట్ వేదిక కావాలని పేర్కొన్నారు.బుధవారం కరీంనగర్ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నూతన కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగుల సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేసేది ఉద్యోగులేనని సీఎం అన్నారు. ఉద్యోగులే ప్రభుత్వానికి ప్రతినిధులని పేర్కొన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు వచ్చినా.. చెడ్డ పేరు వచ్చినా అది ఉద్యోగుల పనితీరుపైనే ఆధారపడి ఉంటుందని చెప్పారు.

సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలకు సహాయం కోసం వచ్చే ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా వారి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలని స్పష్టం చేశారు.

'సహాయం కోసం కార్యాలయాలకు వచ్చే వారిలో మీ కుటుంబ సభ్యులను చూడాలి. వారి సమస్యలను సొంత సమస్యలుగా భావించి పరిష్కరించాలి" అని ముఖ్యమంత్రి సూచించారు. ఉద్యోగులు అంకితభావంతో పనిచేసినప్పుడే పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు.ప్రజలకు ప్రభుత్వంపై మరింత విశ్వాసం కలిగేలా అధికారులు వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు నేరుగా సేవలు అందించే ఉద్యోగులకు మెరుగైన మౌలిక వసతులు




కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.ఉద్యోగుల సంక్షేమం కోసం రూ.944 కోట్లతో వివిధ పనులను ప్రారంభించుకున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు సేవలు అందించడంతోపాటు ఉద్యోగుల సమస్యలను కూడా ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోంద న్నారు. మిగిలిన సమస్యలను సైతం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవన నిర్మాణాన్ని పూర్తి చేశామని తెలిపారు. ఉద్యోగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతోనే సమీకృత కార్యాలయాల సముదాయాన్ని నిర్మించినట్లు చెప్పారు.

రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంతో ముందుకు వెళ్తామని సీఎం తెలిపారు. రాజకీయ సిద్ధాంతాలు వేరుగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతుల కోసం కేంద్రాన్ని కలవడంలో ఎలాంటి సంకోచం లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉన్నా.. ఎన్నికలు లేని సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో పనిచేయాలని సూచించారురాష్ట్ర అభివృద్ధి అవసరాల కోసం ఆరు నెలల వ్యవధిలో 170 ఎకరాల రక్షణ భూములను బదలాయించేలా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. బేగంపేట రన్‌వే కింద నుంచి రోడ్డు నిర్మాణానికి అవసరమైన అనుమతులు కూడా సాధించామని చెప్పారు.వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రాజెక్టులు నిర్మించినా.. కేంద్రం నుంచి అవసరమైన అనుమతులు రాకపోతే వాటి ప్రయోజనం ప్రజలకు అందదన్నారు. అందుకే రాష్ట్ర ప్రయోజనాల కోసం అవసరమైన చోట కేంద్రంతో సమన్వయం చేసుకుంటామని స్పష్టం చేశారు.

**"కరీంనగర్‌పై మరోసారి సమీక్ష"**

కరీంనగర్ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై మరోసారి పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తానని రేవంత్‌రెడ్డి తెలిపారు. అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణలి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే భవిత

**మొదటి పేజీ తరువాయి...**

పరిశీలించారు. ముఖ్యంగా పారిశుద్ధ్య, హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను గుర్తించి, గ్రామ పంచాయతీ సమావేశాల్లో తీర్మానాలు చేసి అమలు చేయాలని సూచించారు. గ్రామంలోని డ్రైన్లు, రోడ్లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు దోమలు, ఈగల వ్యాప్తిని అరికట్టేందుకు ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు.అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ ఉపాధ్యాయుల హాజరు వివరాలను పరిశీలించారు. తెలుగు ఉపాధ్యాయుడు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైనట్లు గుర్తించిన ఆమె, దీనిపై సాయంత్రం లోపు నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పాఠ్యాంశాలపై మంచి పట్టు సాధించాలని సూచించారు.

పాఠశాలలో అక్షయపాత్ర ద్వారా అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, భోజనం నాణ్యత, మెనూ అమలు తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని సూచించారు.

పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలను కూడా తనిఖీ చేసిన కలెక్టర్, ఉపాధ్యాయుల హాజరు, విద్యాబోధన తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాబోధనలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, కేంద్రం మూసి ఉండటాన్ని గమనించారు. కేంద్రం మూసి ఉండటానికి గల కారణాలను సూపర్‌వైజర్‌ను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ టీచర్ కొన్ని రోజులుగా విధులకు హాజరు కావడం లేదని సూపర్‌వైజర్ వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. సంబంధిత అంగన్వాడీ టీచర్, సూపర్‌వైజర్, పై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు.

అనంతరం దేవరకద్ర కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ని సందర్శించిన కలెక్టర్, నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, ఏ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను నెలరోజుల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని కేజీబీవీ ప్రత్యేక అధికారి అనురాధ తెలిపారు.

కేజీబీవీలోని వంటగది, స్టోర్‌రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రత ప్రమాణాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు వంటల్లో నాణ్యమైన కూరగాయలను వినియోగించాలని సూచించారు. కూరగాయలను నిల్వ ఉంచిన షెల్ఫ్‌ను పరిశీలించి, డైట్ మెనూను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య, వారి విధుల వివరాలను కూడా పరిశీలించారు.

తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ ఆరో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు సక్రమంగా ఉన్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్య, వసతి సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

కలెక్టర్ వెంట డోకూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం అక్టోబర్ 2న ఆందోళన



**వనపర్తి జిల్లా కేంద్రంలో పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొనాలి**

**టీయూడబ్ల్యూజే--ఐజేయు నాయకులు రాములు నాయుడు**

వనపర్తి అక్షిత ప్రతినిధి : జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన భద్రత, వివిధ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే--ఐజేయు) ఆధ్వర్యంలో అక్టోబర్ 2న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐజేయు నాయకులు రాములు నాయుడు పిలుపునిచ్చారు.

బుధవారం వనపర్తి జిల్లా కొత్తకోటలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అక్టోబర్ 2న వనపర్తి జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహం సమీపంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి జిల్లాలోని టీయూడబ్ల్యూజే--ఐజేయు నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాలు నియోజకవర్గ, మండల కేంద్రాల్లో కాకుండా జిల్లా కేంద్రంలోనే నిర్వహిస్తున్నందున జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్, ఉర్దూ మీడియా ప్రతినిధులతో పాటు వీడియో జర్నలిస్టులు, ఫోటో జర్నలిస్టులు ప్రతి ఒక్కరూ వనపర్తి జిల్లా కేంద్రానికి చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యలపై ఐక్య పోరాటం దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన భద్రత తదితర అంశాలపై ఐక్య ఉద్యమాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయు) పిలుపు మేరకు ఈ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజాస్వామ్యంలో జర్నలిజం కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకుని వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు, సంబంధిత సంస్థలు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

జర్నలిస్టుల వృత్తిపరమైన హక్కులు, భద్రత, సంక్షేమం, సామాజిక రక్షణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించి, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం టీయూడబ్ల్యూజే--ఐజేయు ఆధ్వర్యంలో చేపడుతున్న ఉద్యమంలో ప్రతి జర్నలిస్టు భాగస్వామి కావాలని కోరారు. మన హక్కు--మన గళం--మన ఐక్యత అనే నినాదంతో అక్టోబర్ 2న జరిగే ఆందోళనలో పెద్ద సంఖ్యలో పాల్గొని జర్నలిస్టుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

## మండలం బెస్ట్ టీచర్‌గా సుర్వి శ్రీనయ్య గౌడ్

**విద్యార్థుల పట్ల ప్రేమాభిమానాలు, అంకితభావంతో సేవలకు గుర్తింపు**



యాదాద్రి భువనగిరి అక్షిత బ్యూరో: ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల్లో భాగంగా నిర్మెముల గ్రామానికి చెందిన ఎంప్లాయిస్ అసోసియేషన్ కోశాధికారి సుర్వి శ్రీనయ్య (శ్రీనివాస్) గౌడ్ మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన జడ్పీహెచ్ఎస్ గుజ్జ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల పట్ల ప్రేమాభిమానాలు, ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేయడం, విద్యార్థులు సన్మార్గంలో నడుస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యంతో పనిచేయడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. విద్యాబోధనతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఉన్నత లక్ష్యాల పట్ల అవగాహన కల్పించేందుకు ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ సుర్వి శ్రీనయ్య గౌడ్‌ను అభినందించారు.

## జలసిరి పనులపై మంత్రి సీతక్క దిశానిర్దేశం





రామన్నపేట అక్షిత ప్రతినిధి: రామన్నపేట రైతు వేదికలో బుధవారం పంచాయతీరాజ్ మంత్రి ఆధ్వర్యంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రస్తుతం ఎక్కువ మంది కూలీలకు ఉపాధి కల్పించే విధంగా పనులను చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా జలసిరి పనులను అధిక సంఖ్యలో చేపట్టి వేగవంతం చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి కూలీలకు నిరంతరం ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీఓ రాములు, ఎంపీవో రఫీ, ఏపీవో వెంకన్న, అన్ని గ్రామాల సర్పంచులు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

# అలివేలు కుటుంబానికి ఆర్థిక భరోసా

**మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్**



కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి: పెద్దకొత్తపల్లి మండలం మారేడు మాన్ దిన్నె గ్రామానికి చెందిన ఇదగోటి అలివేలు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ 9 రోజుల క్రితం మరణించారు. బుధవారం వారి దిశదినకర్మ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్లు మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా అలివేలు కుటుంబానికి ఆర్థిక సహాయం 5000 పంపగా విదగోటి అలివేలు ఇంటి దగ్గరకి గ్రామ పెద్దలు వెళ్లి వారి కుమారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తమటం వెంకటస్వామి గౌడ్, మాజీ వార్డు మెంబర్ మహేష్ నాయక్ వార్డు మెంబర్ గంగం సాయిబాబు, తెలుగు సంఘం అధ్యక్షుడు రేనయ్య, తాలూకా వడ్డెర సంఘం అధ్యక్షుడు వెంకటస్వామి, తెలుగు సంఘం మండల కార్యదర్శి సందు జగన్, వెంకటస్వామి భీమ నాయక్ ఓర్సు శివ మల్లేష్ వడ్డే పెద్దయ్య గోవుల నిరంజన్ రాజు పల్లపు బాలయ్య నరసింహా బాలయ్య ఓర్సు నాగేంద్రం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కానాయపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ఆల జన్మదిన వేడుకలు



వనపర్తి అక్షిత ప్రతినిధి : వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ వడ్డే శ్రీనివాసులు ఆధ్వర్యంలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు బీఆరెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆరెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ పోటీలకు ఊదరి రాధే శ్యామ్



చౌటుప్పల్/ అక్షిత న్యూస్: యాదాద్రి భువనగిరి జిల్లా,చౌటుప్పల్‌లోని ట్రినిటీ హైస్కూల్ ప్రాంగణంలో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్ 14,అండర్-17 మల్ల ఖంబ్ ఎంపిక పోటీలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.

ఈ ఎంపిక పోటీలలో ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని వివిధ క్రీడాకారుల ప్రతిభ,నైపుణ్యం మరియు క్రీడా ప్రదర్శన ఆధారంగా ఎంపికైన క్రీడాకారులు తెలంగాణ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ఐ మల్లంబ్ పోటీలలో ప్రాతినిధ్యం వహించనున్నారు. మంగళవారం జరిగిన మల్ల ఖంబ్ పోటీలో తంగడపల్లి గ్రామానికి చెందిన ఊదరి శ్యామ్ సుందర్,లావణ్య దంపతుల కుమారుడు ఊదరి రాధే శ్యామ్ ఎంపిక అయ్యి ఉమ్మడి నల్లగొండ తరపున రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి ఊదరి రాధే శ్యామ్ ను ఎంఈఓ గురువారావు, పీఈటీపీ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణమూర్తి,ఎస్ జి ఎఫ్ మండల కార్యదర్శి లింగయ్య,ట్రినిటీ హైస్కూల్ చైర్మన్ కె.వి.బి. కృష్ణారావు,ట్రినిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కమ్ డైరెక్టర్ ఉజ్జిని మంజుల,తెలంగాణ మల్లంబ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం. గోపాల్ లు అభినందించి రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



## మాజీ సర్పంచ్ లలితమ్మకు నివాళులర్పించిన మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్



కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి: కొల్లాపూర్ నియోజక వర్గం చిన్నంబావి మండలం గడ్డ బస్వాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ మందడి లలితమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పెద్దకొత్తపల్లి మండల మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ మంగళవారం గ్రామానికి విచ్చేసి లలితమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం లలితమ్మ కుమారుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మందడి చిదంబర్ రెడ్డిని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. లలితమ్మ మరణం గ్రామానికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో కోడేరు సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ నక్క వేణుగోపాల్ యాదవ్, సీనియర్ నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దివీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి వైద్య శిబిరం




చౌటుప్పల్ / అక్షిత న్యూస్: చౌటుప్పల్ పట్టణ కేంద్రం బంగారుగడ్డ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో కౌన్సిలర్ మహమ్మద్ హన్నుబాయి ముఖ్యఅతిథిగా పాల్గొని ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ నరేష్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన విద్యార్థులకు ఉచితంగా మందులను కౌన్సిలర్ మహమ్మద్ హన్ను బాయి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం విద్యార్థులకు రాత పుస్తకాలను అందజేసి వారు మాట్లాడుతూ... విద్యాసంస్థలకు దివీస్ పరిశ్రమ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జీ రమాదేవి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, దివిస్ ప్రతినిధులు బి గోపి,జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆర్థిక సాయం



మహబూబాబాద్, అక్షిత బ్యూరో: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త సుదనబోయిన వెంకన్న తల్లి వెంకటమ్మ ఇటీవల మృతి చెందారు. బుధవారం గ్రామ శాఖ నాయకులు కుటుంబాన్ని పరామర్శించి రూ.11,500 నగదు, 25 కేజీల బియ్యం అందజేశారు. కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని నాయకులు తెలిపారు. వెంకటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో షేక్ ఖాదర్ బాబా, గద్దపాటి సంతోష్, అనపర్తి మదన్, సిరికొండ కృష్ణ, ఏర్పుల హుస్సేన్, గద్దపాటి వేణు, జిన్నుక ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టా రీతిన అక్రిడేషన్లు



హనుమకొండ జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు

**ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారుల సూచన మేరకు జీవో నిబంధనల మేరకే అక్రిడేషన్లు జారీ పూర్వపు డిపిఆర్ఓ అయుబ్ ఖాన్**

వరంగల్, అక్షిత బ్యూరో: హన్మకొండలో పూర్వ డీపీఆర్వోగా పనిచేసి ప్రస్తుతం వరంగల్ మహానగర పాలక సంస్థలో ప్రజా సంబంధాల అధికారిగా విధులు నిర్వహిస్తున్న అయూబ్ అలీపై విచారణకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. విచారణ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌ను నియమించారు.

2026--2028 సంవత్సరాలకు జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మంగళవారం కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పది మందితో కూడిన అక్రిడిటేషన్ కమిటీ రెండు దఫాలుగా సమావేశమై జర్నలిస్టుల దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారికి గుర్తింపు ఇవ్వడంతో పాటు అర్హతలేని దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచుతూ తీర్మానాలు చేసినట్లు సభ్యులు తెలిపారు.

అయితే కమిటీ సిఫారసులను పక్కనపెట్టి, కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించే విధంగా డీపీఆర్వో ఇష్టానుసారంగా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేశారంటూ సభ్యులు ఆరోపించారు. రాజకీయ నాయకుల వద్ద పనిచేసే వ్యక్తులు, రియల్ ఎస్టేట్ రంగానికి చెందినవారు, జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు సైతం కార్డులు జారీ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

కలెక్టర్ను కలిసిన వారిలో గాడిపల్లి మధు, బీఆర్ లెనిన్, గడ్డం కేశవమూర్తి, మస్కపురి సుధాకర్, కంకణాల సంతోష్, బొల్ల అమర్, గోకారపు శ్యాం, వల్లాల జగన్, ఎన్. బుచ్చిరెడ్డి, నయీమ్ పాల్గొన్నారు.

**నిబంధనలు మేరకే అక్రిడేషన్లు జారీ పూర్వపు డిపిఆర్ఓ ఆయుభ్ ఖాన్**

ప్రభుత్వ నిబంధనలకు జీవో ప్రకారం అర్హులైన జర్నలిస్టులు అందరికీ సభ్యుల ఆమోదంతో మాత్రమే ఆమోదం తెలిపిన అనంతరం జిల్లా కలెక్టర్ అనుమతితో అక్రిడేషన్ల ప్రక్రియ పూర్తి చేసాము తప్ప ఇతర విషయాలతో ప్రభుత్వ అధికారులుగా తమకు ఎలాంటి సంబంధం లేదని పూర్వపు హనుమకొండ జిల్లా డి పి ఆర్ ఓ అయూబ్ ఖాన్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసే క్రమంలో ఇతరులు చెప్పే ఆదేశాలు తాము పాటించలేమని ఉన్నతాధికారులు జీవోల ప్రకారం మాత్రమే పనిచేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

## చేనేత సహకార సంఘ అభివృద్ధికి కృషి చేస్తా

**చేనేత పారిశ్రామిక సహకార సంఘం 51వ వార్షిక,65వ సర్వసభ్య సమావేశం...**

**సంఘ చైర్మన్ బడుగు మోహన్ బాబు**



చౌటుప్పల్ / అక్షిత న్యూస్: చేనేత సహకార సంఘానికి పూర్వ వైభవం తీసుకురావడానికి,సంఘం అభివృద్ధికి నిరంతరం తన శ్రాయశక్తుల కృషి చేస్తానని సంఘ చైర్మన్ బడుగు మోహన్ బాబు తెలిపారు. బుధవారం చేనేత పారిశ్రామిక సహకార-వస్త్ర ఉత్పత్తి విక్రయ సంఘం ఆధ్వర్యంలో 51వ వార్షిక,65 వ సర్వసభ్య సమావేశం చౌటుప్పల్ పట్టణంలోని పద్మ వంశీ ఫంక్షన్ హాల్ లో చేనేత సహకార సంఘం అధ్యక్షులు బడుగు మోహన్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిదిగా చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక విజయ్ కుమార్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘ మేనేజర్ రాపోలు శ్రీరాములు అంచనా ఆదాయాలు,జమా ఖర్చులను చదివి వినిపించగా సర్వసభ్య సమావేశము ఆమోదించింది. ఈ సందర్భంగా సంఘ చైర్మన్ బడుగు మోహన్ బాబు మాట్లాడు తూ.. కార్మికులకు చేతినిండా పని కల్పించి చౌటుప్పల్ చేనేత సహకార సంఘానికి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మండల మాజీ ఎంపీపీ చిక్క నరసింహ, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ లు బడుగు మాణిక్యం, బడుగు లక్ష్మయ్య 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, జిల్లా చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు గుర్రం నరసింహ, చౌటుప్పల్ చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షులు గోశిక చక్రపాణి గుర్రం రవీందర్ కందగట్ల బిక్షపతి, శ్రీ శివ భక్త మార్కండేయ దేవస్థానం అధ్యక్షులు బడుగు ప్రకాష్, మాజీ ఎంపీటీసీ పెద్దికృష్ణ, చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షులు గోశిక శ్రీకాంత్, కార్యదర్శి కాటాబత్తిని భీమయ్య, కోశాధికారి బడుగు సావిత్రి,డైరెక్టర్లు బత్తుల మానస, పావని రామకృష్ణ, గోశిక లక్ష్మీపతి, గోశిక నరసింహ, దోర్నాల లక్ష్మీనారాయణ, సంఘ సేల్స్ మెన్ గోశిక ప్రభాకర్, నార్కట్పల్లి సేల్స్ మెన్ పాపని వాసుదేవ్, సంఘం ఇన్చార్జి గోశిక ధనంజయ, సంఘం అటెండర్ ఎరుకల రాములు పాల్గొన్నారు.

## ఇక నుంచి కష్టమే..

**డేట్ ఆఫ్ బర్త్, డెత్ సర్టిఫికేట్ పొందాలంటే**

**అక్టోబర్ 1 నుంచి కేంద్రం కొత్త రూల్స్..**

**అమల్లోకి కఠిన మార్పులు..**




ఇచ్చోడ అక్షిత న్యూస్: జనన, మరణ సర్టిఫికెట్లు పొందాలంటే ఇక నుంచి కష్టతరం కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం జనన, మరణ సర్టిఫికెట్ల జారీలో కీలక మార్పులు చేసింది. రిజిస్ట్రేషన్ ఆఫ్ బర్త్,అండ్ డెత్ (అమెండ్మెంట్) యాక్ట్, 2026 పేరుతో కొత్త నిబంధన లను ప్రవేశపెట్టింది. 2026 అక్టోబర్ 1 నుండి ఈ కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. ఇక నుంచి జననం, మరణం జరిగిన తేదీ నుండి 21 రోజుల్లోగా నమోదు చేసుకోవాలి. 21 రోజుల్లోగా నమోదు చేసుకుంటే ఎలాంటి అదనపు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. ఇక ఒక సంవత్సరం నుండి రెండేళ్ల లోపు నమోదు చేసుకుంటే ప్రక్రియ కొంత కఠినంగా ఉంటుం ది. డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్, సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ ద్వారా అధికారం పొందిన ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఆదేశం తప్పనిసరి అవుతుంది. సంబంధిత అధికా రులు దరఖాస్తులోని వివరాలను క్షుణంగా పరిశీలి స్తారు. అధికారులు నిజమో కాదో ధ్రువీకరిస్తారు. అనంతరం నిర్ణీత ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసు కావాల్సి ఉంటుంది. ఇక రెండేళ్ల దాటిన తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే అత్యంత ఆలస్య నమో దుగా పరిగణిస్తారు. ఈ కేటగిరీ దరఖాస్తులకు అత్యం త కఠిన నిబంధనలు అమల్లో ఉంటాయి. మీ కుటుంబంలో ఎవరిదైనా జననం, మరణం ఇప్పటి వరకు అధికారికంగా నమోదు కాకపోతే.. ఆలస్యం చేయకుండా మీ స్థానిక జనన, మరణ రిజిస్ట్రార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం లేదా సంబం ధిత ప్రభుత్వ అధికారిని సంప్రదించండి. అనంతరం అవసరమైన వివరాలు తెలుసుకుని తగిన ప్రక్రియను పూర్తి చేయండి. సకాలంలో నమోదు చేయని పక్షంలో భవిష్యత్తులో విద్య, ఉద్యోగం, వారసత్వం, ఇతర ప్రభుత్వ సేవలను పొందడంలో అవాంతరాలు ఏర్పడ వచ్చు.

# నోరు విప్పని అధికారులు..
# పెరుగుతున్న సందేహాలు

**మీ సేవ కేంద్రాల కేటాయింపులో మతలబేంటి?**

**10 నెలలుగా సాగుతున్న జాప్యం.. జంగేడు, గొర్లవీడు కేంద్రాల ఫలితాలపై ఉత్కంఠ**

**తెర వెనుక రాజకీయమా..? అధికారుల మౌనం ఎందుకు..?**

**పారదర్శకతపై నిరుద్యోగ అభ్యర్థుల్లో అనుమానాలు**



**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లిజిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న మీ సేవ కేంద్రాల కేటాయింపు ప్రక్రియపై అనుమానాలు ముసురుకుంటున్నాయి. నోటిఫికేషన్ జారీ చేసి దాదాపు 10 నెలలు గడిచినా ప్రక్రియ పూర్తికాకపోవడంపై నిరుద్యోగ అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జంగేడు, గొర్లవీడు మీ సేవ కేంద్రాల ఫలితాలు ఇప్పటికీ వెల్లడించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

**పరీక్ష.. ఇంటర్వ్యూ.. మరి ఫలితాలెక్కడ?**

మీ సేవ కేంద్రాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. కొన్ని కేంద్రాలకు సంబంధించిన అభ్యర్థుల ఎంపిక వివరాలు వెల్లడైనప్పటికీ.. జంగేడు, గొర్లవీడు కేంద్రాల విషయంలో మాత్రం ఎందుకు జాప్యం జరుగుతోందన్నది ప్రశ్నార్థకంగా మారింది. అన్ని కేంద్రాలకు ఒకే విధమైన ఎంపిక ప్రక్రియ నిర్వహించినప్పుడు.. రెండు కేంద్రాల విషయంలో మాత్రమే ఎందుకు నిర్ణయం పెండింగ్‌లో ఉంది? అన్న ప్రశ్నలకు అధికారుల నుంచి స్పష్టత కరువైంది.

**తెర వెనుక రాజకీయం ఉందా..?**

మీ సేవ కేంద్రాల కేటాయింపులో రాజకీయ జోక్యం ఉందన్న అనుమానాలు అభ్యర్థుల్లో వ్యక్తమవుతున్నాయి. పరీక్ష, ఇంటర్వ్యూ మార్కుల ఆధారంగా మెరిట్ ప్రకారం ఎంపిక చేశారా? ఎంపిక ప్రమాణాలు ఏమిటి? అన్న వివరాలను బహిర్గతం చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.. మిగతా జిల్లాల్లో పరీక్షలలో వచ్చిన మార్కులను వెబ్ సైట్ లో ఉంచారని మరి భూపాలపల్లి జిల్లాలో ఎందుకు పెట్టలేదని ప్రశ్నిస్తున్నారు..

**నోరు విప్పని అధికారులు.. పెరుగుతున్న సందేహాలు**

దాదాపు పది నెలలుగా కొనసాగుతున్న ప్రక్రియపై అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం లేకపోవడంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. జంగేడు, గొర్లవీడు కేంద్రాల ఫలితాలను ఎందుకు ప్రకటించడం లేదు? ఎంపిక ప్రక్రియలో ఏమైనా అభ్యంతరాలు వచ్చాయా? ఏదైనా ఫిర్యాదు లేదా విచారణ కొనసాగుతోందా? లేక పరిపాలనా కారణాలతోనే కేటాయింపు నిలిచిపోయిందా? అన్నది అధికారులు వెల్లడించాలి..

**కలెక్టర్ దృష్టిసారించాలి**

జిల్లాలో నిరుద్యోగులకు సంబంధించిన ఇంత కీలకమైన కేటాయింపు ప్రక్రియ నెలల తరబడి పెండింగ్‌లో ఉండటం వెనుక అసలు కారణమేంటన్నది ఇప్పుడు చర్చగా మారింది. జిల్లా ఉన్నతాధికారులకు పూర్తి సమాచారం ఉందా? లేక కింది స్థాయిలోనే నిర్ణయాలు సాగుతున్నాయా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా వెల్లడించి, పరీక్ష--ఇంటర్వ్యూ మార్కులు, మెరిట్ జాబితా, ఎంపిక ప్రమాణాలు, జంగేడు--గొర్లవీడు కేంద్రాల ఫలితాలపై స్పష్టత ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు...అధికారులు వాస్తవాలను వెల్లడిస్తేనే తెర వెనుక ఏం జరుగుతోందన్న అనుమానాలకు తెరపడనుంది..ఈ అంశంపై కలెక్టర్ దృష్టి సారించాలని నిరుద్యోగులు కోరుతున్నారు..

# ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను
# దహనం చేసిన బీజేపీ నాయకులు

**జాతీయ రహదారిపై బీజేపీ నాయకుల నిరసన...**

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల బిక్షం గౌడ్**

**మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్**



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఇటీవల శ్రీరాముడు, పరమశివుడి గురించి చేసిన వ్యాఖ్యలకు నిరసిస్తూ బుధవారం బిజెపి నాయకులు, కార్యకర్తలు చౌటుప్పల్ మున్సిపాలిటీ వలిగొండ క్రాస్ రోడ్ వద్ద తమ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గుమ్మడి కాయలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోలు పెట్టి వాటిని పగలగొట్టారు. అనంతరం బిజెపి నాయకులు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ... శ్రీరాముడిని ధనికులకు, శివుడిని పేదలకు సంబంధించిన దేవుడిగా పేర్కొంటూ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు హిందూ సమాజం యొక్క మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని బిజెపి నాయకులు పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై బిజెపి నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

అలాగే భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై కూడా నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ దేశ ప్రధానిని గౌరవించే విధంగా ప్రజాప్రతినిధులు బాధ్యతయుతమైన భాషను ఉపయోగించాలని కోరారు.

హిందూ దేవతలను రాజకీయాలకు ఉపయోగించకుండా అన్ని మతాల దేవతలను సమానంగా గౌరవించాలని డిమాండ్ చేశారు.

శ్రీరాముడు, శివుడు కోట్లాదిమంది హిందువుల ఆరాధ్య దైవాలని వారి గురించి విభజనకు దారి తీసే విధంగా వాక్యాలు చేయడం సరికాదని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల భిక్షం గౌడ్,మున్సిపల్ అధ్యక్షులు కడారి కల్పన ఐలయ్య యాదవ్, రూరల్ అధ్యక్షులు కైరం కొండ అశోక్, సీనియర్ నాయకులు రమణగోని శంకరయ్య,ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి చినుకుని మల్లేశం, కౌన్సిలర్లు బుడ్డ సురేష్, పోలపల్లి లక్ష్మీ ముత్తయ్య, సర్పంచులు తంగళ్ళ వెంకటేశం, నందగిరి వెంకటేశం గౌడ్,కంచర్ల గోవర్ధన్ రెడ్డి, బత్తుల జంగయ్య గౌడ్,కాయితి రమేష్ గౌడ్, దిండు భాస్కర్,కట్ట కృష్ణ, ఉడుగు వెంకటేశం గౌడ్, బాతరాజు ధనుంజయ, ఆనగంటి విష్ణుకాంత్, అమృతం దశరథ, బడుగు కృష్ణ, యాస అశోక్ రెడ్డి, పబ్బతి శేఖర్, లగ్గాని పాండు, కానుగు కొండల్,తేలుకుంట్ల శ్రీధర్, బూత్ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు

**హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ విజయకేతనం...**

**ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి తిగుళ్ల శ్రీనివాస్**



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ భాగస్వామ్యంతో కూడిన కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం విజయోత్సవ సంబరాలు నిర్వహించినట్లు చౌటుప్పల్ మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా తిగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ.. "హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎన్నికల్లో కామ్రేడ్ దిల్షాదా రైహాన్ 2,178 ఓట్లు సాధించి 451 ఓట్ల మెజారిటీతో విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగా ఘన విజయం సాధించడం సంతోషకరమన్నారు."విద్యార్థుల హక్కులు, విద్య, స్కాలర్‌షిప్‌లు, క్యాంపస్‌లో ప్రజాస్వామ్య హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతోందన్నారు. హెచ్.సి.యు విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఎర్రజెండాకు అందించిన ఈ విజయంతో దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమానికి మరింత స్ఫూర్తి లభించిందన్నారు.కామ్రేడ్ దిల్షాదా రైహాన్ కి ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కమిటీ తరఫున విప్లవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరవిందు,వరుణ్, శ్రీ సాయి, వంశీ, నితిన్ లు పాల్గొన్నారు.

# ప్రసవం అనంతరం తల్లి, శిశువు మృతి

**వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటున్న కుటుంబీకులు..**




**తాండూరు అక్షిత ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రసవం కోసం ఆసుపత్రిలో చేరిన ఓ మహిళ, ప్రసవం అనంతరం శిశువుతో సహా మృతి, చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

తాండూరు మండలం జినుగుర్తి గ్రామానికి చెందిన బాలమణి ప్రసవం కోసం తాండూరులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేరినట్లు కుటుంబీకులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం సేడం తాలూకాకు చెందిన రాజుతో కొన్నేళ్ల క్రితం బాలమణికి వివాహం జరిగినట్లు వారు పేర్కొన్నారు.

ఆసుపత్రిలో బాలమణి ప్రసవం అనంతరం శిశువుకు జన్మనిచ్చి నప్పటికీ, కొద్దిసేపటికే తల్లి, శిశువు ఇద్దరూ మృతి, చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

వైద్యుల నిర్లక్ష్యం కారణం గానే తల్లి, శిశువు మృతి చెందారని, కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. మృతికి అసలు కారణాలపై వైద్యుల వివరణ, అధికారుల విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెలుగు లోకి వచ్చే అవకాశం ఉంది.

## కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

### బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలపై సీపీఎం నిరసన ర్యాలీ



సత్తుపల్లి, అక్షిత న్యూస్: కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సత్తుపల్లిలోని పాత సెంటర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, పారదర్శకతపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మోరంపూడి పాండురంగారావు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా ఎన్నికల సంఘం వ్యవహరించాల్సి ఉందన్నారు."ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడాలి. ఎన్నికల సంఘం స్వతంత్రతను పరిరక్షించాలి.జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి" అంటూ సీపీఎం నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, పార్టీ నాయకులు రావుల రాజబాబు, శీలం కరుణ, చావా రమేష్, చప్పిడి భాస్కర్, ఎస్‌కే వలి, సైదా, ఎస్‌కే భాష, వెంకటేశ్వరరావు, జిలాని, రఫీ, నబీ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం మహిళా పి ఎస్ సిఐ ఉస్మాన్ షరీఫ్ మర్యాదపూర్వకంగా కలిసిన టీజేపు బృందం



ఖమ్మం /అక్షిత బ్యూరో : ఖమ్మం మహిళా పి ఎస్ సిఐ గా బాధ్యతలు చేపట్టిన సిఐ ఉస్మాన్ షరీఫ్ ని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేయు) జిల్లా అధ్యక్షులు నాగ స్వామి టీజేపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ ఖాసీం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రషీద్ జిల్లా నాయకులు వాసం రాజేంద్రప్రసాద్ వెంపటి నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేయాలి



తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి : విద్యార్థినిలు పట్టుదలతో వైద్య విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం తిరుమలగిరి అధ్యక్షులు, కార్యదర్శులు ఎన్ విటల్ రెడ్డి, బి నర్సయ్య కోరారు. బుధవారం పెన్షనర్స్ భవన్ తిరుమలగిరిలో 2026 నీట్ లో ఎంబిబిఎస్ సీట్లు సాధించిన జలాల్ పురం గ్రామానికి చెందిన ముత్తినేని వైష్ణవి రిమ్స్ ఆదిలాబాద్, జేత్యా తండాకి చెందిన ధరావత్ అలేఖ్య ప్రభుత్వ మెడికల్ కాలేజ్ వనపర్తిలను శాలువా, మెమోంటోలచే ఘనంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం తిరుమలగిరి మండల శాఖ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా అధ్యక్షులు విటల్ రెడ్డి చెరో పది వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మందడి పద్మారెడ్డి, కోశాధికారి చిత్తలూరి పుల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు చెట్టిపల్లి మల్లయ్య, కేసిడి రామిరెడ్డి, ఉప్పల పద్మమ్మ, కె పుష్పలీల, కె రాములు, కె కొమిరెల్లి, పి సత్యనారాయణ తదితర పెన్షనర్లు, బంధువులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతికి పెద్దకొత్తపల్లిలో మహనీయుల విగ్రహావిష్కరణ

### పీఎంఆర్ గార్డెన్‌లో సన్నాహక సమావేశం కరపత్రాలు ఆవిష్కరించిన మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్



కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి: పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో మహాత్మ జ్యోతిరావు పూలే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బుధవారం మండల కేంద్రంలోని పీఎంఆర్ గార్డెన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పెద్దకొత్తపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వన్నోజు సత్యం సభాధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విగ్రహాల దాత, మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్, పుట్టపాగ మహేంద్రనాథ్ శిష్యులు, మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ కే. మురళీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ మాట్లాడుతూ పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచికుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు డాక్టర్ గోరటి వెంకన్న, కూచికుళ్ల దామోదర్‌రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన కాసిం, తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి. శ్రీనివాస్ గౌడ్, పుట్టపాగ మహేంద్రనాథ్ కుమారుడు, కర్ణాటక మాజీ డీజీపీ పుట్టపాగ రవీంద్రనాథ్ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ హేమంత్ కేశవ్ పాటిల్, పుట్టపాగ మహేంద్రనాథ్ శిష్యులు కే. మురళీధర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ఉపసర్పంచులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రతిపక్ష పార్టీల నాయకులు, సర్పంచులు, కమ్యూనిస్టు నాయకులు కూడా కుల, మతాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూర్య ప్రతాప్ గౌడ్ పిలుపునిచ్చారు. తాను ఎంపీపీగా కొనసాగిన కాలంలో ప్రభుత్వం నుంచి వచ్చిన జీతభత్యాలను సైతం ప్రజా సంక్షేమ కార్యక్రమాల కోసం వినియోగించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో చేపట్టిన కార్యక్రమాలు ఏ ఒక్క కులం, మతం లేదా వ్యక్తిగత ప్రయోజనం కోసం కాకుండా ప్రజల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని చేపట్టినవేనని తెలిపారు. ప్రతి కులాన్ని గౌరవిస్తూ, అన్ని వర్గాల అభివృద్ధిని కోరుకునే నాయకత్వాన్ని జూపల్లి కృష్ణారావు కొనసాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. జూపల్లి కృష్ణారావు ఆలోచనా విధానానికి అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం ముందుకు సాగుతున్నామని తెలిపారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించనున్న విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సూర్య ప్రతాప్ గౌడ్ కోరారు. అనంతరం నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో సర్పంచులు ఆది ధర్మేందర్, లోకనేని లక్ష్మణరావు, భారీవాములు మానస రాకేష్, ఆవుల యాదగిరి, చెంది వెంకటమ్మ-వెంకటయ్య, జంగమ్మ కృష్ణగౌడ్, గౌసిద్దీన్ పాషా, మొట్టె కుర్మయ్య, బయన్న, సింగిల్ విండో వైస్ చైర్మన్ మెరుగు రాజు, డైరెక్టర్ కిషన్ నాయక్, మాజీ సింగిల్ విండో చైర్మన్ గోపాలరావు, ఉపసర్పంచులు బైరాముడు, శంకర్ నాయక్, కొత్త రవీందర్‌రెడ్డి, బాలమ్మ-వెంకటస్వామి, మాజీ సర్పంచులు పగడాల చిన్నయ్య, దొండ శ్రీను, సాలయ్య, గట్టయ్య, సీతారాం నాయక్, బొల్లె నిరంజన్, శ్రీనివాసులు, ఎండీ సలీం, మాజీ ఎంపీటీసీలు డి. రవికుమార్, కొండల్ గౌడ్, బద్య నాయక్, వెంకటస్వామి గౌడ్, మాజీ ఉపసర్పంచులు మేకల మల్లేష్, జి. మల్లేష్, కాంగ్రెస్ నాయకులు గుమ్మకొండ రమేష్, బొల్లి విష్ణు, బాల్ నారి, సైదులు, డాక్టర్ గాదారి చంద్రశేఖర్, పుట్ట ఆంజనేయులు, జి. సుధాకర్, జంగం పెద్ద నాగరాజు, వి. బాలలింగాచారి, ముచ్చపోతు శంకర్, సత్యనారాయణ గౌడ్, ఓర్సు చిన్న సుల్తాన్ తదితరులతో పాటు దాదాపు 200 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశం ముగింపులో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సభాధ్యక్షుడు వన్నోజు సత్యం కోరారు.

# బిసి, ఎంబీసీలను విస్మరిస్తున్న పాలకులు

### బీసీ- జెఎసి రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు



వరంగల్, అక్షిత బ్యూరో: పట్టభద్రుల నియోజకవర్గం లో అభ్యర్థులను నిలపడంలో కాంగ్రెస్ పార్టీ బీసీలను విస్మరించిందని మిగిలి ఉన్న ఇతర పార్టీలు బీసీలకు అవకాశం కల్పించి రెండు సీట్లలో బీసీలకు ఒక సీటు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అభిప్రాయం వ్యక్తం చేశారు.

బిసి సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ దేశాయి పేటలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు విచ్చేసి మాట్లాడుతూ బీసీ ఉద్యమం ఉవ్వెత్తున నడుస్తున్న క్రమంలో అనాదిగా బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించి న్యాయమైన పోరాటం చేస్తున్న బీసీలకు కాంగ్రెస్ పార్టీ రెండు సీట్లను అగ్రవర్ణాలకు కేటాయించి అన్యాయం చేసిందని మిగిలిన పార్టీలు బీసీలకు కేటాయించి వారి మద్దతు తెలియజేయాలని కోరారు. నవంబర్ లో గవర్నర్ కోట లో ఖాళీ అవుతున్న మూడు స్థానాల్లో రెండు బీసీలకే కేటాయించాలని అందులో ఎంబీసీలకు ఒక స్థానం ఇవ్వాలని డిమాండ్ చేసినారు. అన్ని పార్టీలు బీసీ ఎంబీసీలకు న్యాయం చేసేలా తమ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తరతరాలుగా బీసీలపై జరుగుతున్న అన్యాయాలు అవమానాలు ఇకనైనా ఆపేసి రాజ్యాధికారంలో అధికారంలో బీసీల వాటా తేల్చాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి హితవు పలికారు. లేనట్లయితే బీసీల ఆగ్రహానికి పార్టీలు బలికాక తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ జాక్ బాధ్యులు డాక్టర్ ఎర్రబొజ్జు రమేష్, డాక్టర్ పాలడుగుల సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న పోరాటాలను తీవ్రతరం చేయండి

**ఏఐకేఎంఎస్ సంస్థను సంఘటిత పరిచి మరింత విస్తరింప చేయాలి**






**ఖమ్మం /అక్షిత బ్యూరో :** అఖిల భారత రైతు కూలీ సంఘం 4వ జాతీయ మహాసభలు ఖమ్మంలో ప్రారంభమయ్యాయి. గత జాతీయ మహాసభల నుంచి నేటి వరకు సంఘం నిర్వహించిన కార్యక్రమాలు చేపట్టిన పోరాటాలు సాధించిన విజయాలు ఎదురైన అనుభవాలను వివరిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆశిష్ మిట్టల్ వివరమైన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. దానిలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేపట్టిన చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతాంగం సాగించిన పోరాటాల్లో ఏఐకేఎంఎస్ చురుకైన పాత్ర పోషించిందని ఆయన తెలిపారు. ముఖ్యంగా ఢిల్లీ సరిహద్దుల్లో పంజాబ్ తదితర రాష్ట్రాల్లో సాగిన రైతాంగ ఉద్యమంలో – ఏఐకేఎంఎస్ విస్తృతంగా పాల్గొని ఉద్యమాన్ని బలోపేతం చేసిందన్నారు. మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో రైతాంగ ఉద్యమం సాధించిన విజయాన్ని ఆయన ప్రస్తావించారు.

ఈ ఉద్యమం ద్వారా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ సహా అనేక రాష్ట్రాల్లో రైతాంగంతో ఏఐకేఎంఎస్సంబంధాలు విస్తృతమయ్యాయని సంస్థకు కొత్త ప్రాంతాల్లో పరిచయాలు ఏర్పడి ఉద్యమ విస్తరణకు మార్గం ఏర్పడిందని తెలిపారు. ఉద్యమ సందర్భంగా ఎదురైన అనుకూల, ప్రతికూల అనుభవాలను సమీక్షించుకొని భవిష్యత్ పోరాటాలకు వాటిని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

**భూమి సమస్యపై నిరంతర పోరాటాలు**

దేశవ్యాప్తంగా భూమి సమస్యపై ఏఐకేఎంఎస్ నిర్వహించిన పోరాటాలను నివేదికలో ప్రధానంగా ప్రస్తావించారు. బీహార్ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ఒడిశా తదితర రాష్ట్రాల్లో భూమిలేని పేదలు రైతులు కౌలు రైతులు దళితులు ఆదివాసీల భూమి సమస్యలపై పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు.బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ప్రతిఘటిస్తూ అనేక రాష్ట్రాల్లో ప్రాంతాల్లో రైతాంగాన్ని భూమిపై ఆధారపడిన ప్రజలను సమీకరించి పోరాడినట్లు కొన్ని విజయాలు సాధించినట్లు ఇది కిలో పేర్కొన్నారు. భూస్వాముల భూకబ్జా ల్యాండ్ మాఫియా ఇసుక మాఫియాలకు వ్యతిరేకంగా కూడా ఉత్తర ప్రదేశ్ పంజాబ్ ఒరిస్సా తదితర రాష్ట్రాల్లో పోరాటాలు సాగినట్లు నివేదికలో పేర్కొన్నారు. పంజాబ్ లో దళితులకు భూమి సాధించేందుకు నిర్వహించిన పోరాటాలను పోలీసుల నిర్బంధాన్ని, వందలకొద్దీ మూడు నెలలు జైల్లో గడిపిన విషయాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను బలహీనపరిచి, దాని స్థానంలో వీబీ గ్రామగ్ వంటి కొత్త విధానాన్ని తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ – ఏఐకేఎంఎస్ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఉద్యమాలు నిర్మించిందని డాక్టర్ సతీష్ మిట్టల్ తెలిపారు.

గ్రామీణ పేదలకు ఉపాధి హామీ కూలీలకు పని దినాలు, వేతనాలు సామాజిక భద్రత వంటి అంశాలపై గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తృతమైన ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

సంస్థాగత బలోపేతమే ముందున్న ప్రధాన కర్తవ్యం గత కాలంలో జరిగిన పోరాటాల విజయాలను సమీక్షించుకోవడంతో పాటు, వాటి నుంచి సంస్థాగత నిర్మాణానికి అవసరమైన పాఠాలను నేర్చుకోవాలని జాతీయ ప్రధాన కార్యదర్శి సూచించారు.ఈ సమావేశానికి అధ్యక్ష వర్గంగా వేములపల్లి వెంకటరామయ్య సుశాంత్ జై చలపతిరావు రవీందర్ సింగ్ తదితరులు వ్యవహరించారు.

## మామిళ్లగూడెం అర్బన్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ రామారావు



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ రామారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా కేంద్రంలో జరుగుతున్న సాధారణ వ్యాక్సినేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కేంద్రంలోని ఓపీ, ల్యాబ్ మరియు వ్యాక్సినేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందికి ఇమ్యునైజేషన్ షెడ్యూల్ టీకాల అనంతరం చాలా అరుదుగా తలెత్తే దుష్ప్రభావాల సమర్థవంతమైన నిర్వహణపై పలు కీలక సూచనలు చేస్తూ రీ-ఎడ్యుకేట్ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గర్భిణుల సంరక్షణ కోసం ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ల శాతాన్ని మరింతగా పెంచాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మామిళ్లగూడెం యూపీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కృష్ణ చైతన్య, డాక్టర్ శ్రావ్య, సీహెచ్‌వో సంధ్యారాణి నర్సింగ్ ఆఫీసర్ నాగమ్మ ఫార్మసిస్ట్ పి. లక్ష్మి అకౌంటెంట్ నాగాలక్ష్మి ఏఎన్ఎంలు రాజేశ్వరి హేమలత దయామణి నాగరాణి చంద్రమణి భవాని ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి ఒక్కరు పాటించాలి

**అయినాపూర్ సర్పంచ్ ఏర్పుల కళ్యాణి కృష్ణ పిలుపు**



**కొమురవెల్లి అక్షిత న్యూస్:** సిద్దిపేట జిల్లా కలెక్టర్ జిల్లా సమాచారపౌరసంబంధాల మరియు ఎంపీడీఓ శ్రీనివాస్ వర్మ ఆదేశాల మేరకుతెలంగాణసాంస్కృతిక సారధి కళా బృందం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో సీజనల్ వ్యాధులపై కళాజాత కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ ఏర్పుల కళ్యాణి కృష్ణ హాజరై మాట్లాడుతూ మన ఇల్లు మన వీధి మన గ్రామం ఆరోగ్యంగా ఉండాలని పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత పై సీజనల్ వ్యాధులపై తడి పొడి చెత్త, హానికరమైన చెత్త, ఐ వేస్టు నాలుగు రకాల చెత్తను వేరు చేయాలని మనం బాగుంటే ఊరంతా బాగుంటుందని స్వచ్ఛమైనగ్రామం కోసం ప్రతిఒక్కరూసహకరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు,ఉప సర్పంచ్ మల్లం శ్రీనివాస్, మరియు పాలక వర్గం వార్డుసభ్యులు,తెలంగాణ సాంస్కృతిక సారధి కవి గాయకులు పిస్సింటి రత్నం,గజ్వేల్ టీమ్ లీడర్ శ్యామ్,పుల్లూరుయాదగిరి, సనువాల కనకయ్య,గెంటే హరిప్రసాద్,పస్సీరు శ్రీనివాస్, ఎల్లసిద్దులు, తండ బిక్షపతి, బందారు నర్సింలు,పద్మ,శైలజ, మమత తదితరులు అవగాహన కల్పించారు.

# ప్రీ-ప్రైమరీ విద్యతో చిన్నారులకు బంగారు భవిష్యత్

**జంగని రవి, మద్రిముచ్చాల సర్పంచ్**



**కొమురవెల్లి అక్షిత న్యూస్:** కొమురవెల్లి మండలం మద్రిముచ్చాలగ్రామ ప్రభుత్వ పాఠశాలలో ప్రీ–ప్రైమరీ సెక్షన్ ప్రారంభం కావడం గ్రామ విద్యా రంగానికిశు భపరిణామమని మద్రిముచ్చాల సర్పంచ్ జంగని రవి పేర్కొన్నారు. చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలనే ప్రభుత్వ సంకల్పంలో భాగంగా ప్రీ–ప్రైమరీ సెక్షన్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,చిన్నారుల మేధో వికాసానికి ప్రాథమిక విద్య ఎంతో కీలకమని, చిన్న వయస్సులోనే విద్యపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రీ–ప్రైమరీ తరగతులు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా వాతావరణం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలుఅందుబాటులోఉన్నాయని,తల్లిదండ్రులు తమ పిల్లలనుప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.గ్రామ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. విద్య ద్వారానే సమాజఅభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈసమావేశంలో ఎంఈఓ కోనేటి రవి, పాఠశాల హెచ్ఎం రాంపల్లి అశోక్,పాఠశాల చైర్మన్ తురైసంగీత,ఉపాధ్యాయులు సాంబయ్య,సబిత, భాగ్యలక్ష్మి, వైష్ణవి,రిటైర్డ్ ఎంఈఓ వంగ గాల్ రెడ్డి, మద్రిముచ్చాలఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు వంగ జగన్నాథ రెడ్డి, తదితరులుపాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY

గురువారం |01| అక్టోబర్| 2026

## డిజిటల్ లెర్నింగ్‌తో గణిత బోధన మరింత ప్రతిభావంతం

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్**



**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** విద్యారంగంలో విప్లవాత్మక మార్పులతో చేపట్టిన డిజిటల్ లెర్నింగ్ విదానంతో గణిత బోధన మరింత ప్రతిభావంతంగా జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో గణిత ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న "ఎ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్" శిక్షణ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులలో గణితం పై ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారి తార్కిక ఆలోచన సామర్థ్యం, సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ఆధునిక సాంకేతికతను గణిత బోధనలో విస్తృతంగా వినియోగించాలని తెలిపారు. సాంప్రదాయ బోధన విధానాలతో పాటు ఆధునిక సాంకేతిక వనరులను సమర్ధవంతంగా వినియోగించడం ద్వారా విద్యార్థులకు క్లిష్టమైన గణిత భావనలను సులభంగా, ఆసక్తికరంగా, దృశ్య రూపంలో అర్థమయ్యేలా బోధించవచ్చని తెలిపారు. ఆధునిక సాంకేతికతను ఉపాధ్యాయుడి బోధన సామర్థ్యాన్ని మరింత పెంచే శక్తివంతమైన సాధనంగా చూడాలని తెలిపారు. శిక్షణలో ఉపాధ్యాయులు పొందిన జ్ఞానం, నైపుణ్యాలను తరగతి గదులలో ఆచరణలోకి తీసుకువచ్చి ప్రతి విద్యార్థికి నాణ్యమైన గణిత అభ్యాసనాన్ని అందించాలని తెలిపారు. విద్యార్థుల అభ్యాసనా స్థాయికి అనుగుణంగా డిజిటల్ వనరులను వినియోగిస్తూ లెర్నింగ్ బై డూయింగ్, యాక్టివిటీ బెస్ట్ లర్నింగ్ విధానాలను ప్రోత్సహించాలని, విద్యార్థులకు కనీస అభ్యాసన సామర్థ్యాల సాధన గణిత అభ్యాసన ఫలితాల మెరుగుదల కోసం ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి విద్యా ప్రమాణాల మెరుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ నాణ్యత సమన్వయకర్త ఉప్పులేటి శ్రీనివాస్, కేంద్ర నిర్వాహకులు మహేశ్వర్, రిసోర్స్ పర్సన్లు, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

**ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు**



**ఖమ్మం /అక్షిత బ్యూరో:** పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు కోరారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫాం- 18 ద్వారా 2023 నవంబర్ నాటికి డిగ్రీ లేదా దానికి సమానమైన డిప్లొమా పూర్తి చేసిన వారు ఆన్లైన్లో లేదా ఆఫ్లైన్లో సెప్టెంబర్ 28 నుండి ఓటరుగా నమోదు చేసుకోవాలని నవంబర్ 6 చివరి తేదీ లోపు నమోదు చేసుకోవాలని సూచించారు.

## ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ

# నిర్వహించిన జిల్లా ఎస్పీ డి.జానకి



**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం జిల్లా ఎస్పీ డి.జానకి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్టేషన్‌లోని జనరల్ డైరీ, కేసు రికార్డులు, ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన రికార్డులు, పెండింగ్ కేసులు, చలాన్లకు సంబంధించిన రికార్డులు, వాహన తనిఖీలు, ప్రమాదాల వివరాలు, కోర్టు కేసులకు సంబంధించిన రికార్డులు, సిబ్బంది విధుల కేటాయింపు, బీట్ డ్యూటీ వివరాలు తదితర రికార్డులను పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు క్రమబద్ధంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. అలాగే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, ట్రాఫిక్ ఉల్లంఘనలపై చేపడుతున్న చర్యలు, వాహన తనిఖీలు, ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నిర్వహణ, రద్దీ సమయాల్లో సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది అందరితో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి విధులు, బాధ్యతలను తెలుసుకున్నారు. సిబ్బందిని ఒక్కొక్కరిగా పరిచయం చేసుకొని, విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులు మరియు అవసరాలను అడిగి తెలుసుకున్నారు. "విధుల నిర్వహణలో మీకు ఏమైనా సమస్యలు లేదా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలి" అని ఎస్పీ సిబ్బందికి సూచించారు. సిబ్బంది సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎప్పుడైనా ఏదైనా అవసరం ఉన్నప్పుడు సంకోచించకుండా ఎస్పీ కార్యాలయానికి నేరుగా వచ్చి తన దృష్టికి తీసుకురావచ్చని భరోసా కల్పించారు.

ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బంది నిరంతరం వాహనాల రాకపోకల మధ్య విధులు నిర్వహించడం వల్ల వాయు కాలుష్యం, దుమ్ము, పొగ వంటి వాటికి గురయ్యే అవకాశం ఉన్నందున ఆరోగ్య పరిరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. విధుల నిర్వహణతో పాటు తమ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని తెలిపారు.

ప్రజలకు మెరుగైన ట్రాఫిక్ సేవలు అందించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం, రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం, విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మరియు సిబ్బందికి జిల్లా ఎస్పీ సూచించారు.

ఈ వార్షిక తనిఖీలో డీఎస్పీ రమణారెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డి, సబ్-ఇన్‌స్పెక్టర్లు, ఏఎస్ఐలు మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాదిపల్లిలో ఘనంగా సహభాగిత గ్రామీణ మదింపు

**రైతులు--విద్యార్థుల భాగస్వామ్యంతో గ్రామ వనరులు, సమస్యలపై అధ్యయనం**



**కాజీపేట్,అక్షిత ప్రతినిధి :** మాదిపల్లి గ్రామంలో ఎస్ఆర్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రామ్ లో భాగంగా సహభాగిత గ్రామీణ మదింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డా. జి. భూపాల్ రాజ్, బి. ఆది రెడ్డి, అనురాధ, సుమన్, గ్రామ సమన్వయకర్త డా. జి. భార్గవి, కోఆర్డినేటర్ టి. సాయి కృష్ణ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు, రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామస్థులతో కలిసి సామాజిక మ్యాప్, వనరుల మ్యాప్, పంటల శాతం, నేలల రకాలు, గ్రామ చరిత్ర టైమ్‌లైన్, సమస్యల వృక్షం , మొబిలిటీ మ్యాప్, సీజనల్ క్యాలెండర్ తదితరాలను రూపొందించి ప్రదర్శించారు. విద్యార్థుల కృషి, చక్కటి ప్రదర్శన, రైతులతో కలిసి కొత్త విషయాలను నేర్చుకుంటున్న విధానాన్ని బి. ఆది రెడ్డి,అనురాధ అభినందించారు. వ్యవసాయ మరియు ప్రభుత్వ కార్యక్రమాల్లో విద్యార్థులు--రైతుల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. డీన్ డా. జి. భూపాల్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు గ్రామీణ వ్యవసాయ పరిస్థితులను ప్రత్యక్షంగా అర్థం చేసుకునేందుకు కార్యక్రమాలు అవసరమని తెలిపారు.ఈ సందర్భంగా కొంతమంది రైతులు మరియు విద్యార్థులు తమ అభిప్రాయాలను, అనుభవాలను పంచుకున్నారు. ద్వారా గ్రామంలోని వనరులు, సమస్యలు, వ్యవసాయ పరిస్థితులను సమగ్రంగా తెలుసుకునే అవకాశం కలిగిందని రైతులు తెలిపారు.గ్రామ సమన్వయకర్త డా. జి. భార్గవి కార్యక్రమానికి హాజరైన అధికారులు, అధ్యాపకులు, రైతులు, గ్రామస్థులు మరియు విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రాంనగర్ సెక్టార్‌లో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం

**జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్**



**అక్షిత బ్యూరో, మంచిర్యాల :** మహిళ, శిశు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం పోషణ మాసం కార్యక్రమాన్ని అమలు చేస్తుందని, ఈ క్రమంలో బుధవారం మంచిర్యాల పట్టణంలోని రాంనగర్ సెక్టార్ లో పోషణ మాసం ను ఘనంగా నిర్వహించడం జరిగిందని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, డివిజన్ కార్పొరేటర్ శ్రీలక్ష్మి, సి డి పి ఓ విష్ణుప్రియ, సూపర్‌వైజర్ జ్యోతి లతో కలిసి గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు సమతుల్యమైన పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానాలను చిన్ననాటి నుంచే అలవర్చాలని తెలిపారు. పోషణ మాసం కార్యక్రమం ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులలో పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రత, ప్రారంభ విద్యపై అవగాహన మరింత పెంచాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యకరమైన తరం నిర్మాణానికి తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది, అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అనంతరం గర్భిణీలకు శ్రీమంతాల కార్యక్రమం, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.సి. సతీష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, గర్భిణీలు, చిన్నారులు పాల్గొన్నారు.